క్లుప్తంగా

నిస్సహాయుల్ని ఆదుకోవాలి

సైదాబాద్: ప్రకృతి వైపరీత్యాల వేళల్లో నిస్సహాయుల్ని సామాజిక బాధ్యతగా అందరూ ఆదుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు సింగరేణి కాలనీలో నివసించే పలువురు గుడిసెవాసులు రోజుకూలీ పనుల దొరకక ఇబ్బందులు పడుతున్నారు. గురువారం స్థానిక కార్యకర్తల ద్వారా సమాచారం అందుకున్న వీరేంద్రబాబు యాదవ్ 50 కుటుంబాల వారికి పాలు, బ్రెడ్లు, పండ్లు వంటి నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మూసీ పరీవాహక ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

చాదర్‌ఘాట్: వర్షాల వల్ల వ్యాధులు ప్రబలకుండా ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్‌లో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ ఎంఓ జ్యోతి తెలిపారు. వానల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూసీనది పరీవాహక ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎవరికైనా జ్వరం, జలుబు, దగ్గు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయ సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, కాలనీవాసులు పగిల్ల నర్సింగ్ పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



సుధీర్‌రెడ్డి దంపతులకు బాబా చిత్రపటాన్ని బహూకరిస్తున్న గుండ మల్లయ్య

చైతన్యపురి: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కమలాసుధీర్‌రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి బాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గుండ మల్లయ్య, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు సాయి చిత్రపటాన్ని బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముంపునకు శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలి



గుంటి జంగయ్యనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, భాగ్యలత, బీడీఎల్ కాలనీలు ఎగువనుంచి వస్తున్న వరదతో వర్షాకాలంలో తరచూ ముంపునకు గురవుతున్నాయని, శాశ్వత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కోరారు. గురువారం ఆయన జెడ్సీతో కలిసి హైకోర్టు కాలనీ, భాగ్యలతా కాలనీల్లోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. జేసీబీ, మాన్‌సూన్ సిబ్బంది సహాయంతో వర్షపు నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈఈ రమేష్, డీఈ దామోదర్, ఏఈ నరేంద్రతేజ, టీపీఎస్ ఉమ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటి జంగయ్యనగర్, సద్గురునగర్‌ల్లో..

ఎగువన ఉన్న వనస్థలిపురం, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వరదతో గుంటి జంగయ్యనగర్, సద్గురునగర్ పరిసర కాలనీలు వరద ముంపునకు గురవుతాయని, నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. గురువారం ఆయన గుంటి జంగయ్యనగర్, సద్గురునగర్‌ల్లో పర్యటించి వరద నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కృష్ణమూర్తి, అనిల్‌కుమార్, రవికుమార్, రాజేష్, భార్గవ్, లడ్డు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంకు నివాళి



వనస్థలిపురంలోని అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామ్మోహన్‌గౌడ్

వనస్థలిపురం: రక్షణ శాఖలో శాస్త్రవేత్తగా దేశానికి ఎనలేని సేవ చేయడమే కాకుండా భారత రాష్ట్రపతిగా పనిచేసి ఆ పదవికే వన్నెతెచ్చిన మహావ్యక్తి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని బీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ అన్నారు. గురువారం వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి కలాం 8వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమానికి రామ్మోహన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కొలిశెట్టి సంజయ్‌కుమార్, బీరం శ్రీధర్, యాదగిరి, భాస్కర్, దేవదాస్, శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు.

ఆగని వర్షం.. కాలనీల జలమయం



మన్సూరాబాద్‌లో వరదనీటితో పొంగిపొర్లుతున్న నాలాలు

మన్సూరాబాద్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మన్సూరాబాద్‌లోని నాలాలు పొంగిపొర్లడంతో వరదనీరు కాలనీలను, ప్రధాన రహదారులను ముంచెత్తింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సరస్వతినగర్, మల్లికార్జుననగర్, హిమపురికాలనీ, వినాయక్‌నగర్, ఆగమయ్యనగర్, వీకర్‌సెక్షన్ కాలనీల్లోకి వరద నీరు చేరింది. మన్సూరాబాద్ నుంచి కామినేని ప్రధాన రహదారి వరకు నాలాల్లోని వరదనీరు రోడ్డుపై భారీగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎల్‌బీనగర్ చింతలకుంటలోని రెయిన్‌బో హాస్పిటల్ వద్ద జాతీయ రహదారిపై భారీగా వరదనీరు చేరింది.

బురదమయంగా కుమ్మరికుంట కట్ట



గుంతలతో బురదమయంగా మారిన కుమ్మరికుంట కట్ట

జారిపడుతున్న ద్విచక్ర వాహనదారులు



హయత్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న జెడ్సీ పంకజ తదితరులు

హయత్‌నగర్: వర్షం కారణంగా హయత్‌నగర్‌లోని కుమ్మరికుంట కట్ట పెద్ద పెద్ద గుంతలు పడి బురదమయంగా మారింది. కట్టపై రోడ్డు గుంతలు పడటంతో గతంలో మట్టిని పోశారు. వర్షాల వల్ల ఆ మట్టి కరిగిపోయి రోడ్డు బురదతో చిత్తడిగా తయారైంది. దీంతో కట్ట పైనుంచి వెళ్లే ద్విచక్ర వాహనాలు జారిపడుతున్నాయని, దీంతో బిక్కు బిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన..

భారీ వర్షాల కారణంగా హయత్‌నగర్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. బీడీఎల్ కాలనీ, భాగ్యలత కాలనీల నుంచి కిందికి వచ్చే వరద నీరు కాలనీల్లో నిలవకుండా జేసీబీ సాయంతో కిందికి మళ్లించారు.

అయ్యప్ప కాలనీకి వరద

- ఇళ్లలోకి చేరి నీరు
- ఆందోళనకు గురవుతున్న కాలనీవాసులు
- ఇళ్లు ఖాళీ చేసి వెళ్తున్న వైనం

నాగోలు: భారీ వర్షాలకు నాగోల్ డివిజన్‌లోని అయ్యప్ప కాలనీలోని ఇళ్లలోకి వరదనీరు రావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని అయ్యప్ప కాలనీ, మల్లికార్జునగర్ కాలనీలకు పైకాలనీల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వస్తోంది. అయ్యప్ప కాలనీ మీదుగా బాక్స్ డ్రెయిన్‌ను నిర్మించి బండ్లగూడ చెరువులో కలిపారు. అయ్యప్ప కాలనీలోకి మరో మార్గంలో వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో కాలనీవాసులు తమ ఇళ్లను ఖాళీ చేసి వేరే ప్రాంతానికి వెళ్తున్నారు. పక్కనే బండ్లగూడ చెరువు ఉండటంతో కాలనీని వరద ఎప్పుడు ముంచేస్తుందోననే ఆందోళనతో కాలనీవాసులు కాలం గడుపుతున్నారు. వందల కోట్లు ఖర్చు పెట్టి బాక్స్ టైప్ నాలా పనులు చేస్తున్నప్పటికీ అయ్యప్ప కాలనీ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాగా, కాలనీలోకి వచ్చిన వరద నీటిని బయటకు పంపించే ప్రయత్నం చేశారు.



అయ్యప్ప కాలనీలో ఓ ఇంట్లోకి చేరిన వరదనీరు



కాలనీలో ప్రవహిస్తున్న వరద నీరు

రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోండి



సరూర్‌నగర్ చెరువు పరిసర కాలనీలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్ : మరికొన్ని రోజులు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న దృష్ట్యా ప్రభుత్వ అధికారులు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. గురువారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ అత్యవసర బృందం, డీఆర్‌ఎఫ్, ఎస్‌ఎన్‌డీపీ అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు, సరూర్‌నగర్ చెరువు పరిసర కాలనీల్లో పర్యటించారు. రహదారులపై విరిగిపడిన చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగింపజేశారు. రహదారులపై వరదనీరు నిలువకుండా సాఫీగా డ్రైనేజీల్లోకి వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పలు ప్రాంతాల్లో రహదారులపై పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



ఎల్‌బీనగర్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న క్రిస్టియన్ యూత్ వింగ్ నేతలు

మన్సూరాబాద్: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను అరికట్టి శాంతిని నెలకొల్పాలని ఎల్‌బీనగర్ క్రిస్టియన్ యూత్‌వింగ్ నేత విస్సర్ల ప్రవీణ్‌కుమార్ కోరారు. ఎల్‌బీనగర్ క్రిస్టియన్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద సేవ్ మణిపూర్... సేవ్ డెమాక్రసీ నినాదాలతో బుధవారం రాత్రి కాగడాలతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కొన్ని దుష్టశక్తుల ప్రమేయంతో మణిపూర్‌లో అశాంతి నెలకొందని, రాష్ట్రపతి జోక్యం చేసుకుని మణిపూర్ మంటలను ఆర్పాలని విజ్ఞప్తిచేశారు. జాతుల మధ్య నెలకొన్న విభేదాలను మతాలకు పులమడం సరికాదన్నారు. కార్యక్రమంలో కొంగరి నర్సింహారావు, జైపాల్, నరేష్, శ్యామ్, సన్నీ, రాజ్‌కుమార్, సత్యం, జాన్, మేరీ, రిచెల్, వందన పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ సుధీర్‌కుమార్



చాదర్‌ఘాట్ బ్రిడ్జి వద్ద వరదను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

చాదర్‌ఘాట్: ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు అధికారుల సూచనలను తప్పక పాటించాలని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ సుధీర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం చాదర్‌ఘాట్‌లోని చిన్నబ్రిడ్జి వద్ద వరద నీటిని స్థానిక ట్రాఫిక్ ఏసీపీ కందుల సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిమాయత్‌సాగర్ నుంచి వస్తున్న వరదనీటి ఉధృతి అధికంగా ఉన్న దృష్ట్యా కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సాఫీగా సాగేలా చూడాలని ఆయన సూచించారు. చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ బ్రిడ్జీల వద్ద ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నాలాల్లోకి చెత్త చేరకుండా చర్యలు



సరూర్‌నగర్ చెరువు ఔట్‌లెట్‌ను పరిశీలిస్తున్న సీఈ జియావుద్దీన్, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: నాలాల్లో చెత్త చేరకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ జియావుద్దీన్ అన్నారు. గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి సరూర్‌నగర్ చెరువు ఔట్‌లెట్, లోతట్టు కాలనీల్లో సీఈ గురువారం పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వరద నీరు నాలాల్లో సాఫీగా వెళ్లకపోవడంతో వీవీ నగర్, కోదండరాంనగర్ కాలనీల్లోని రహదారులపై ప్రవహిస్తోందని కార్పొరేటర్ వివరించారు. ఫలితంగా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చెరువు నుంచి వచ్చే చెత్తను ఆపడం, నాలాల్లో చెత్తను తొలగించే వ్యవస్థ లేకపోవటం వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. త్వరలో నాలాల్లో చెత్త చేరకుండా చర్యలు తీసుకుంటాని సీఈ హామీ ఇచ్చారు.

ఠాణా, ఆసుపత్రి, ప్లే గ్రౌండ్‌లకు స్థలాల కేటాయింపు

పత్రాలను అధికారులకు అందజేసిన ఉప్పల్ తహసీల్దార్



ఏసీపీ జానకి రెడ్డికి పీఎస్‌కు కేటాయించిన స్థలం పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ గౌతమ్ కుమార్

నాగోలు: నాగోల్ కొత్త పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి బండ్లగూడ సర్వే నం.36/6లో ఎకరం పది గుంటల స్థలాన్ని, ఫతుల్లగూడ సర్వే నం.58 లో జీహెచ్‌ఎంసీ హాస్పిటల్ నిర్మాణానికి 30 గుంటలు, క్రీడా ప్రాంగణానికి ఒక ఎకరం స్థలాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఆదేశాల మేరకు ఉప్పల్ రెవెన్యూ అధికారులు కేటాయించారు. నాగోల్ పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలానికి సంబంధించిన పత్రాలను గురువారం ఎల్‌బీనగర్ ఏసీపీ జానకి రెడ్డికి ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్ కుమార్ పోలీసులు, రెవెన్యూ అధికారులు స్థానికుల సమక్షంలో అందజేశారు. అలాగే, ఆసుపత్రికి, క్రీడా ప్రాంగణానికి కేటాయించిన స్థలాలకు సంబంధిన పత్రాలను హయత్‌నగర్ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ పావనికి ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్ కుమార్, మండల గిర్దావర్ సుధ అప్పగించారు. ఈ స్థలాల హద్దులను మండల సర్వేయర్ ప్రశాంత్ అధికారులకు చూపించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, నాగోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, సర్వేయర్ ప్రశాంత్, రెవెన్యూ అధికారులు సుధ, షాహీన్, వీఆర్‌ఏలు నాగలక్ష్మి చంద్రకళ పాల్గొన్నారు. తాము కబ్జాల నుంచి కాపాడిన 3 ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో ప్రజావసరాలకు కేటాయించడం ఆనందంగా ఉందని తహసీల్దార్ గౌతమ్ కుమార్ అన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 83, వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 65, కాకర 35, బీర 40, క్యాబేజీ 16, ఫ్రెంచి బీన్స్ 75, క్యారెట్ 45, దొండ 18, చిక్కుడు 55, గోకర 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 80, ఆలు 19, దోస 18, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 43. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

బ్రిడ్జి నిర్మాణంలో ప్రభుత్వం జాప్యం



ధోబీఘాట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: మూసారంబాగ్‌లో మూసీనది పరిసర ప్రాంతాల్లో గురువారం కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పర్యటించారు. మూసారంబాగ్ బ్రిడ్జి, ధోబీఘాట్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తివేయడంతో మూసీలో వరద ఉధృతి పెరిగిందని, అప్రమత్తంగా ఉండాలని మూసీ పరిసర ప్రాంతవాసులకు ఆమె సూచించారు. వానలు కురిసినప్పుడల్లా బ్రిడ్జిపై వరద నీరు నిలిచి రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. కార్పొరేటర్‌తో పాటు ఏఈ రవికాంత్, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, శానిటేషన్ జవాన్ రమేష్ ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి

వనస్థలిపురం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి, తమకు ప్రభుత్వం నేరుగా వేతనం ఇచ్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, ఆర్‌ఎంఓ డాక్టర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓలు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి న్యాయ జరిగేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకం భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ శాంతికుమార్, తెలంగాణ వెల్‌నెస్ సెంటర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రిజ్వాన్ మహమ్మద్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్, ఉపాధ్యక్షుడు భానుప్రకాష్, రాజేష్, అనిల్‌గౌడ్, సంధ్య పాల్గొన్నారు.

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించండి: దేప



సరూర్‌నగర్ సర్కిల్‌లోని ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: వర్షాలకు లోతట్టు కాలనీలు ముంపునకు గురై ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లలోని పలు లోతట్టు కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. భాస్కరరెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కసారి ఇక్కడి లోతట్టు ప్రాంతాలలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుకొని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదర్‌రావు, యువజన కాంగ్రెస్ నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు చిక్కుళ్ల శివప్రసాద్, రాముగౌడ్ పాల్గొన్నారు.



జన్మదినం సందర్భంగా భారీ కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యేకు నోట్‌బుక్స్ అందజేస్తున్న జక్కిడి మల్లారెడ్డి, జక్కిడి రఘువీర్‌రెడ్డి



నోట్‌బుక్స్ అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు తూర్పాటి చిరంజీవి, అనంతుల రాజిరెడ్డి

ఘనంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం తన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. హస్తినాపురంలోని జీఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకలకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి ఎమ్మెల్యేను పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు యువ నాయకులు భారీ గజమాలలతో ఎమ్మెల్యేను సత్కరించి ఆయనతో భారీ కేకులను కట్ చేయించారు. పలువురు నోటుబుక్స్‌ను ఎమ్మెల్యేకు అందజేశారు.అనాథ విద్యార్థి గృహం విద్యార్థులు, పలువురు ఎమ్మెల్యేకు పెయింట్ చేసిన ఆయన చిత్రపటాలను, జ్ఞాపికలను అందజేశారు. డీఎస్‌ఆర్ యువసేన ఆధ్వర్యంలో రక్తదాన, వైద్య శిబిరాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా వేలాదిగా తరలివచ్చి తనను ఆశీర్వదించిన నాయకులు, కార్యకర్తలు, కాలనీ నాయకులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం ప్రజల అభిమానం ఎప్పటికీ మరచిపోనని, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, కమలా సుధీర్‌రెడ్డి, పలువురు మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో...

లింగోజిగూడ: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదానం, వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుమల సిమెంట్స్ అధినేత వేదుళ్ళ సుదీర్‌రెడ్డి, బీఎస్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మొవ్వ సతీష్ చౌదరి, నాయకులు కొంగర మహేష్, అనిల్ చౌదరి, పోగుల రాంబాబు, మనోజ్‌కుమార్, శివశంకర్, అర్జున్‌గౌడ్, రషీద్, కృష్ణ, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో...

మన్సూరాబాద్ : బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యేకు ఆయన చిత్రపటంతో పాటు నోట్స్‌బుక్స్ అందజేశారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆయన చిత్రపటాన్ని బహూకరిస్తున్న అనాథ విద్యార్థి గృహం విద్యార్థులు



సుధీర్‌రెడ్డికి భారీ క్రేన్ సహాయంతో గజమాలను వేస్తున్న యువ నాయకులు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి